
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 18.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 27 నవంబరు 2025



ఇది కదా కావాల్సింది..! భావి ఎమ్మెల్యేతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



అసెంబ్లీ అన్నాక.. ఇలా గోల గోల కూడా ఉండాల్సిందే కదా..

అ ధ్యక్షా..! దరగొట్టేశారు..!

సమస్యలపై నిలదీసిన ప్రతిపక్షం

దీటుగా బదులిచ్చిన అధికారపక్షం

స్టూడెంట్ అసెంబ్లీలో జీవించిన విద్యార్థులు

బడి పిల్లలు బాధ్యతగల ఎమ్మెల్యేలు అయ్యారు..! అసెంబ్లీ వేదికగా అధికార, ప్రతిపక్ష సభ్యులుగా విడిపోయారు. స్పీకర్‌ను ఎన్నుకున్నారు..! ఇక సభ మొదలైంది. ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గట్టిగా నిలదీశారు. నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వారికి పాలక పక్షం ఎమ్మెల్యేలు దీటుగా ఎదుర్కొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై మంత్రులు స్పందించారు. తమ తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించారు. 'రాజకీయం చేయొద్దు..' అని ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు హితవు పలికారు. అసెంబ్లీ ఎలా జరిగితే జనం హర్షిస్తారో.. ఎలా జరగాలని జనం కోరుకుంటారో.. చేసి చూపించారు. ఇది స్టూడెంట్ అసెంబ్లీనా..? అసలైన అసెంబ్లీనా..? అని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సహా.. అందరూ కళ్లప్పగించి చూసేలా.. జీవించారు. మొత్తంగా.. అసెంబ్లీని అదరగొట్టేశారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో బుధవారం నిర్వహించిన 'స్టూడెంట్ అసెంబ్లీ'లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల్లో కొందరికే మాట్లాడే అవకాశం వచ్చింది. సమయాభావం వల్ల మిగిలినవారికి అవకాశం రాకపోయినా, అసెంబ్లీలో తమ వంతు పాత్రను పోషించారు. మరపురాన్ని జ్ఞాపకాలను మూటగట్టుకున్నారు.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ పుట్టపర్తి

6

మాదకద్రవ్యాలపై చర్యలేవీ..?

అధ్యక్షా..! రాష్ట్రంలో యువకులు, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వాటి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటోంది..? మీ ద్వారా అడుగుతున్నాను అధ్యక్షా..

-మేఘున, హిందూపురం స్టూడెంట్ ఎమ్మెల్యే



'అధ్యక్షా..! రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి మత్తు పదార్థాలను నియంత్రిస్తున్నాం. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 22 వేల కేజీల గంజాయిని సీజ్‌చేశాం. 2047 నాటికల్లా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం..!'

- స్టూడెంట్ హోం మంత్రి సమాధానం





విద్యార్థులతో కలెక్టర్ శ్యాంప్రసాద్

రాజ్యాంగ విలువలను పరిరక్షించాలి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువల పరిరక్షణలో ప్రతిపౌరుడు భాగస్వామి కావాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బుధవారం భారత సంవిధాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అధికారులతో కలిసి కలెక్టర్ రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన ప్రాథమిక హక్కులు, కర్తవ్యాలను నిర్దేశించడమే కాకుండా సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలు కాపాడే మహత్తర పత్రం అని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతల త్యాగాలు, రాజ్యాంగ రూపకల్పనలోని మహత్తు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడు నిబద్ధతతో పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గాలస్థాయిలో విద్యార్థులకు కలెక్టర్ మెమెంటోలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజు, విద్యార్థులు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పబ్లిక్ సిట్టింగ్..!



కొడికొండ చెక్‌పోస్టు సమీపంలోని పొలాల్లో తాగి పడేసిన మద్యం బాటిళ్లు

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం

పగలు, రాత్రి తేడాలేకుండా హంగామా

చోద్యంచూస్తున్న పోలీసులు

చిలమత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న చిలమత్తూరు మండలంలో బహిరంగ మద్యపానం పరిపాటిగా మారింది. జన సంచారం ఉన్న ప్రాంతాల్లోనే సిట్టింగ్‌లు వేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. నేరం జరిగిన తరువాత పరిశోధన, దర్యాప్తు అంటూ పోలీసులు పరుగులు పెడుతుంటారు. కానీ నియంత్రణకు ముందస్తు చర్యలను తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. చాలా నేరాల వెనుక మద్యం ఉందని పోలీసుల దర్యాప్తులో తేలుతోంది. అయినా బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా తాగుతూ.. ఊగుతున్నా పట్టించుకోవడం లేదు. తాగేదాకా స్నేహంగా ఉండి.. మత్తులో గొడవ పడుతున్నా, ఈ క్రమంలో హత్యలు జరుగుతున్నా తేలిగ్గా తీసుకుంటున్నారు. నేర ప్రవృత్తి ఉన్నవారు మద్యం సిట్టింగ్‌లు వేసినచోట నేరాలకు వ్యూహరచన కూడా చేస్తున్నారు. ఇక మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ప్రమాదాలబారిన పడేవారు, ఎదుటివారి ప్రాణాలను తీసేవారు ఎంతోమంది.

జన సంచారం మధ్యనే..

మధ్యాహ్నం దాటితే చాలు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బాబులు హల్‌చల్ చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కనే చెట్ల కింద సిట్టింగ్‌లు వేస్తున్నారు. చిలమత్తూరు మండలం కర్ణాటకకు సరిహద్దు ప్రాంతం. దీంతో కర్ణాటక మద్యం ఎక్కువగా తీసుకొచ్చి విచ్చలవిడిగా తాగేస్తున్నారు. పంట పొలాలను ఎంచుకుని బహిరంగ ప్రదేశాల్లో కానిచ్చేస్తున్నారు. పొలాల్లో పనిచేసుకునే మహిళలు ఈ మందు బాబులను చూసి భయాందోళనలు చెందుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఇంటికి చేరుకునేవరకు భయంతో వణుకుతున్నారు. కొడికొండ చెక్‌పోస్టుని కేంద్రంగా చేసుకుని, మద్యం బాబులు గ్రామాలకు వెళ్లే దారులను ఎంచుకుంటున్నారు. అలాంటి ప్రదేశాల్లో అయితే పోలీసుల నుంచి ఇబ్బంది ఉండదని భావించి రోడ్డు పక్కనే కూర్చుని పీకలదాకా తాగి హంగామా చేస్తున్నారు.



పట్టించుకోని పోలీసులు

నేరం జరిగిన తరువాత వచ్చే పోలీసులు దానిని ముందుగానే పసిగట్టి అడ్డుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. ఎక్సైజ్

నిత్యం హంగామా

బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల పక్కనే తాగేవారు అర్ధరాత్రి దాటినా ఇళ్లకు వెళ్లకుండా చీకటిలోనే నానా హంగామా చేస్తున్నారు. ఇటీవల కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లికి వెళ్లే మట్టి రోడ్డు పక్కన, చిలమత్తూరు వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన లేఅవుట్లు, బెంగళూరు వెళ్లే 44వ జాతీయ రహదారి పక్కన మందు బాబుల హంగామా ఎక్కువైందని ఆ గ్రామస్థులు పేర్కొంటున్నారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లికి వచ్చే రహదారి పలు గ్రామాలకు ప్రధాన రోడ్డుగా ఉంది. దీంతో ప్రజలు రాత్రి పొద్దుపోయేవరకు ఈ మార్గంగుండా ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు పక్కనే చీకట్లో కూడా మందుబాబులు మద్యం సేవిస్తూ హంగామా చేస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. మద్యం సేవించిన వారు మత్తులో ఏ దుర్మార్గానికి ఒడిగడతారోనని బెంబేలెత్తుతున్నారు.

మద్యం మత్తులో నేరాలు

మద్యం మత్తులో ఉన్న సమయంలో వారు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు. మహిళలపై దాడులు, దారి దోపిడీలు, చోరీలు, గొడవలు తదితర నేరాలకు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం కారణమవుతోంది. ఇటీవల మండలంలోని వ్యవసాయ పొలాల్లో చోరీలు ఎక్కువవుతున్నాయి. విద్యుత్ మోటార్ల స్టార్టర్లు, కేబుల్, ఇతర యంత్ర సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. వ్యవసాయ పనులకు మహిళలు ఒంటరిగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. మందు బాబులతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని క్షణక్షణం భయపడుతున్నారు.

చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం. దానికితోడు జనసంచార ప్రదేశాల్లో గుంపులుగా కూర్చుని సేవించడం అతి పెద్ద నేరం. ఇటువంటి చర్యలతోనే నేరాలు పెరుగుతున్నాయన్న విషయం పోలీసులకు తెలిసినా.. వాటి కట్టడి దిశగా అడుగులు వేయట్లేదు. కనీసం గ్రామానికి సంబంధించిన పోలీసు కానిస్టేబుల్ రాత్రి సమయంలో గస్తీ తిరగకపోవడంతో మందుబాబుల ఆగడాలు మితిమీరాయి. మద్యం సేవించి నేరాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



కనీసం బహిరంగ ప్రదేశాల్లో, పొద్దుపోయాక మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవనే చెప్పాలి. గ్రామాల్లో సైతం మద్యం సేవించిన వారితోనే కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. సాధారణంగా పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరిగితే కొంతవరకు దారి దోపిడీలు, చోరీలు, ఇతర నేరాలు తగ్గుముఖం పడతాయి. మండలంలో మాత్రం పోలీసుల గస్తీ ఎక్కడా కనిపించట్లేదు. దీంతో ఇటీవల నేరాల సంఖ్య పెరుగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఎక్కువగా రోడ్ల పక్కన, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో గుంపులుగుంపులుగా ఏర్పడి మద్యం సేవిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గస్తీ ఏర్పాటుచేసి, కేసులు నమోదు చేస్తాం. మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. -మహేష్, డీఎస్పీ, హిందూపురం

అన్నం.. అస్వస్థత..!

- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిపాలు



బత్తినపల్లిలో చికిత్స పొందుతున్న బాలిక అమృత, రోగులతో ఆరాతీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ



ఓబుళదేవరచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యంలో ఆహారం తిని 20 మంది అస్వస్థతకు గురైన ఘటన మండలంలోని బత్తినపల్లిలో జరిగింది. స్థానికులు, వైద్యశాఖ సిబ్బంది తెలిపిన మేరకు బత్తినపల్లిలో సోమవారం ఓ ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లిన వారు పాయసం, అన్నం తిన్నారు. అయితే ఆ రోజు రాత్రి ఐదుగురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మరుసటి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకాష్, శంకర్, భాగ్యమ్మ, చలపతి, రాములమ్మ, చిన్నారులు జానకీరామ్, హరిరామ్, అమృత, సుధాకర్, సుగుణమ్మ, వెంకటమ్మ, ప్రమీళ, విమలమ్మ, అలివేలమ్మ తదితరులు కూడా వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. దీంతో కలుషిత ఆహారం తినడం వల్లే ఇలా జరిగి ఉంటుందని శుభకార్యానికి వెళ్లిన వారందరూ ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ వైద్యులు డాక్టర్ భాను ప్రసాద్ నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణమ్మ, మంగళవారం రాత్రి గ్రామంలోని కొద్ది మందికి వైద్య చికిత్సలు అందించారు. మరికొంతమందిని మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్, డీపీఎంఓ నాగేంద్రకుమార్‌నాయక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారితో పాటు బత్తినపల్లి ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సైతం మండల వైద్యాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఫోన్‌లోనే బాధితులను పరామర్శించారు.

నిలకడగా ఉంది..

వాంతులో, విరేచనాలతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్ విలేకరులకు తెలిపారు. 20మంది బాధితులకు చికిత్సను అందించామన్నారు. బత్తినపల్లిలో ఇంటింటా సర్వే నిర్వహించామన్నారు. శుభకార్యంలో పాయసం తయారీకి గడువు తీరిన సేమియాలు వాడటం వల్ల ఇలా జరిగి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

దిక్కులేని రోగులు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత

- 68పోస్టులకు 37 ఖాళీ..
- 17విభాగాలకు నలుగురే ప్రొఫెసర్లు
- ఓపీ సేవలకే అలసిపోతున్న డాక్టర్లు
- మధ్యాహ్నం దాటితే ఒక్క వైద్యుడు ఉండరు
- ఐపీ, ఐసీయూల్లో రోగులకు దేవుడే దిక్కు

అనంతపురం వైద్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్యుల కొరతతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోగులు విలవిల్లాడుతున్నారు. ఆస్పత్రి ప్రారంభమై ఐదేళ్లు గడిచినా నేటికీ పూర్తిస్థాయిలో వైద్యులను నియమించలేదు. ఆస్పత్రిలో 17 విభాగాలకు 68 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 31మంది మాత్రమే ఉన్నారు. ఉన్నవారు పని ఒత్తిడితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాకేంద్రంలో రూ.200కోట్లు వ్యయం చేసి అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో వైద్యు లు లేకుండానే కొవిడ్ విజృంభిస్తున్న తరుణంలో ప్రారంభించారు. తర్వాత కూడా పూర్తిస్థాయిలో డాక్టర్లను నియమించలేదు. ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కమిషన్) నిబంధనల మేరకు ప్రతి విభాగానికి కనీసం ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ఆప్రకారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని 17 విభాగాలకు 68మంది డాక్టర్లను నియమించాలి. అయితే 31మంది డాక్టర్లను మాత్రమే నియమించడంతో 37 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఉన్నవారిలో నలుగురు ప్రొఫెసర్లు, తొమ్మిది మంది అసోసియేట్, 18మంది అసిస్టెంట్స్ మాత్ర మే ఉన్నారు. వీరంతా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఓపీలలో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. మధ్యా హ్నం అయితే దాదాపు డాక్టర్లందరూ వెళ్లిపోతున్నారు. దీంతో ఇన్‌పేషెంట్(ఐపీ), ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లలో అడ్మిట్ అయిన రోగులకు దేవుడే దిక్కులా మారింది.

మధ్యాహ్నం దాటితే...


ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అనస్తీషియా, కార్డియాలజీ, ఎండో క్రైనాలజీ, మెడికల్

(మిగతా 6లో..)



ఓపీలో డాక్టర్లను కలిసేందుకు రోగుల కష్టాలు

పోలీసులకు ఫిర్యాదు



పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తనకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి వద్ద ఉన్న పంపు హౌస్‌లో 40 హెచ్‌పీ విద్యుత్ మోటార్లు మూడు చోరీ అయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధి కారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రి లో అసలేమైందో శీర్షికన మండ్లిపల్లి వద్ద ఉన్న పంపుహౌస్ లో మోటార్ల మాయంపై బుధవారం ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు బుధవారం పంపుహౌస్ వద్దకు వెళ్లి పరిశీలించారు. తర్వాత మోటార్లు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పంచాయతీనే కావాలి..!

డిప్యూటీ ఎంపీడీఓల మారాం.. ఉద్యోగోన్నతి వదులుకునేందుకూ సిద్ధం

ప్రమోషన్ అంటే ఏ ఉద్యోగి అయినా ఎగిరి గంతేస్తారు. సంబరాలు చేసుకుంటారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన, ఆ జాబితాలో ఉన్న సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి వస్తున్నా.. వారిలో ఆనందం లేదు. ప్రమోషన్ వచ్చినా.. పంచాయతీ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు చక్కబెడతామని కోరుతున్నారు. రాజకీయ నేతల ముందు ఈ మేరకు డిమాండ్లు ఉంచుతున్నారు. అవసరమైతే.. ప్రమోషన్ వదులుకుంటాం కానీ, పంచాయతీ మాత్రం కావాల్సిందేనన్నట్లుగా మారాం చేస్తున్నారు. వారి తీరుతో ఆ శాఖ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి.

ఇన్‌చార్జిలుగా ఉంటామంటూ నేతల వద్ద డిమాండ్లు

రూరల్-అర్బన్ పంచాయతీలపై కన్నేసిన వైనం



అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల రీ-గ్రేడింగ్‌లో భాగంగా క్లస్టర్ వ్యవస్థకు మంగళం పలికింది. దీంతోపాటు సిబ్బందిలో గ్రేడ్-6 వరకు ఉన్న వారిని గ్రేడ్-3 వరకే పరిమితం చేసింది. అదనంగా రూరల్-అర్బన్ పంచాయతీతోపాటు గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా రూపుదిద్దడానికి విధివిధానాలను ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టింది. రూరల్-అర్బన్ పంచాయతీల కింద జిల్లాలో 10 వేల మంది జనాభాగానీ, కోటి రూపాయల వార్షిక ఆదాయంగానీ ఉన్న పంచాయతీలను (మిగతా 6లో...)

జాయింట్ ఎల్‌పీఎంలు ఉండరాదు

- జేసీ మౌర్యభరద్వాజ్
- రీసర్వే పరిశీలన

ధర్మవరంరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎల్‌పీఎంలు లేకుండా గడువులోపే రీసర్వే పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో చేపడుతున్న భూ రీసర్వేను బుధవారం జేసీ పరిశీలించారు. గ్రామ రెవెన్యూ పొలానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు రీసర్వే చేశారనీ, ఇంకా ఎంత చేయాల్సి ఉందని వివరాలను సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో రీసర్వేపై అభిప్రాయాలు అడిగారు. జేసీ మాట్లాడుతూ- రైతుల వద్ద ఉన్న పాసు పుస్తకాలను పరిశీలించి సర్వే చేయాలన్నారు. భూముల సరిహద్దులు, హక్కుల వివరాలను రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు, రీసర్వే అధికారులు, మండల సర్వేయర్ మంజుల పాల్గొన్నారు.

పోతుకుంటలో రైతన్నా.. మీకోసం..

మండలంలోని పోతుకుంట గ్రామంలో నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. పంటల సాగు, సంరక్షణలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామునాయక్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాస్, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా పాల్గొన్నారు.



చిగిచెర్ల వద్ద రీసర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ మౌర్యభరద్వాజ్



శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి కళ్యాణం చేస్తున్న పురోహితుడు

వేడుకగా షష్ఠి ఉత్సవాలు

- వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

గార్లదిన్నె/ఆత్మకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా బుధవారం వేకువజాము నుంచే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కోటంక గ్రామానికి చెందిన ఆవుల నాగలక్ష్మి, ఆవుల కంచెప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించారు.

పంపనూరులో..

ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వామివారి ఉత్సవమూర్తులును ఊరేగించారు. సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది మంది భక్తులు షష్ఠి ఉత్సవాలకు తరలివచ్చారు.





అలంకరణలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అధ్యక్షా..! అదరగొట్టేశారు..!

- సమస్యలపై నిలదీసిన ప్రతిపక్షం
- దీటుగా బదులిచ్చిన అధికారపక్షం
- స్టూడెంట్ అసెంబ్లీలో జీవించిన విద్యార్థులు



డీఈఓ కార్యాలయంలో స్టూడెంట్ అసెంబ్లీని వీక్షిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా నిర్వహించిన 'స్టూడెంట్ అసెంబ్లీ'లో ఉమ్మడి జిల్లా చిన్నారి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తమకు ఇచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులను రిజర్వేషన్‌ల ఆధారంగా ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో ఎమ్మెల్యేని ఎంపిక చేశారు. రాయదుర్గం ఎమ్మెల్యేగా గంగోత్రి, ఉరవకొండకు లోకేష్, గుంతకల్లుకు స్వప్న, తాడిపత్రికి అనిల్ కుమార్, శింగనమలకు శిరీష, అనంతపురం అర్బన్‌కు సదాఫ్ నాజ్, కళ్యాణదుర్గానికి అభిజ్ఞ, రాప్తాడుకు శ్యామ్ శ్రీనాథ్ రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎంపికయ్యారు. ఈ నెల 22న వీరు ఇద్దరు సోషల్ టీచర్ల పర్యవేక్షణలో అమరావతికి వెళ్లారు. అక్కడ మూడు రోజులు శిక్షణ అనంతరం బుధవారం నిర్వహించిన తమ ప్రత్యేక అసెంబ్లీలో ప్రతిభను చాటుకున్నారు.

అభిజ్ఞ మాటల తూటాలు

కళ్యాణదుర్గం స్టూడెంట్ ఎమ్మెల్యే తలారి అభిజ్ఞ ప్రతిపక్ష ఎమ్మెల్యే పాత్రను పోషించింది. 'మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి' అనే బాధ్యతను విద్యార్థులకు అప్పగించే అంశాన్ని ఎంచుకుని, మాటల తూటాలను పేల్చింది. 'పాఠశాలకు ఆవరణ లేదు.. మొక్కలు ఎక్కడ నాటేది..? తాగేందుకు నీరు లేదు.. మొక్కలకు ఎలా పోసేది..?' అని నిలదీసింది. అచ్చం అసెంబ్లీ పద్ధతిలో స్పీకర్ స్థానాన్ని సంబోధిస్తూ.. 'మంత్రిగారు చెబుతున్న మాటలు పేపర్లలో పచ్చగా బాగా కనిపిస్తున్నాయి..' అని ఎద్దేవా చేయడం అబ్బురపరిచింది. తన మాటలతో అసలు సిసలు ప్రతిపక్ష ఎమ్మెల్యే అనిపించుకుంది. ఇదే అంశానికి స్టూడెంట్ విద్యా మంత్రి బాధ్యతాయుత సమాధానం ఇచ్చారు. 'ప్రభుత్వం పాఠశాలలో తాగునీరు, ఇతర వసతులు కల్పించింది. మొక్కలను పెంచడం గురించి ఎగతాళి చేయడం సరికాదు. విద్యార్థులకు బాధ్యత పెంచేలా ఓ ప్రజాప్రతినిధిగా వారిలో స్ఫూర్తిని నింపాలి' అని సమాధానం చెప్పింది. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యే మధ్య జరిగిన వాదోపవాదాలను అక్కడే ఉన్న సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, సవిత తదితరులు చూసి ఆశ్చర్యపోయారు. తలారి అభిజ్ఞను వారు ప్రశంసించారు.



చించేశారు: స్పీకర్ పోడియం వద్ద ప్రతిపక్ష ఎమ్మెల్యేల నినాదాలు

ఆసక్తిగా వీక్షణ

అమరావతిలో నిర్వహించిన స్టూడెంట్ అసెంబ్లీని ప్రసార మాధ్యమాలలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, ప్రజలు ఆసక్తికరంగా వీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన తీరును చూసి అభినందనలు కురిపించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడానికి టీవీలు, స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.

రాయదుర్గం ఎమ్మెల్యే.. గంగోత్రి



బొమ్మనహాళ్ మండలంలోని లింగదహాళ్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని గంగోత్రి రాయదుర్గం ఎమ్మెల్యేగా స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొంది. కానీ సమయాభావం కారణంగా మాట్లాడే అవకాశం రాలేదు. అయినా సరే, తనకు ఇదో అరుదైన అవకాశమని, అద్భుతంగా తమ అసెంబ్లీ సాగిందని గంగోత్రి తెలిపింది.

మార్షల్.. యశ్వంత్



స్టూడెంట్ అసెంబ్లీలో 'మార్షల్'గా గుంతకల్లు విద్యార్థి యశ్వంత్ అవకాశాన్ని దక్కించుకున్నాడు. పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యశ్వంత్, అసెంబ్లీలో మార్షల్ పాత్ర పోషించాడు.

కొత్తిమీర.. గంజాయి..



లేపాక్షి మండలం పులమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని మేఘన మాక్ హిందూపురం ఎమ్మెల్యే హోదాలో అదరగొట్టింది. రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరిగిందని, దాని నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో సభాముఖంగా తెలియజేయాలని ఆమె స్పీకర్ ద్వారా కోరింది. 'ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ అయినా ఆలస్యంగా వస్తోందేమోగాని.. డ్రగ్స్ మాత్రం సమయానికి వస్తున్నాయి.. కాలేజీల వద్ద గంజాయి ఈజీగా దొరుకుతోంది. నగరంలో కొత్తిమీర దొరకడం కష్టమేమోగాని, డ్రగ్స్ మాత్రం పల్లెల్లోకూడా దొరుకుతున్నాయి..' అంటూ ప్రతిపక్ష ఎమ్మెల్యే పాత్రకు కాస్త ఎక్కువ న్యాయమే చేసింది. దీనికి మంత్రి హోదాలో ఉన్న ఓ విద్యార్థిని దీటుగానే బదులిచ్చింది. 'మీ వంటగది పరిజ్ఞానం చూస్తుంటే ముచ్చటేస్తోంది. డ్రగ్స్‌ను నివారించే చర్యలను కూరగాయల మార్కెట్‌తో పోల్చడం సరికాదు. ప్రభుత్వం స్పందించి కేసులు నమోదుచేస్తోంది. వారిని అదుపులోకి తీసుకుంటోంది.' అని బదులిచ్చింది.

జీవితంలో మరిచిపోను...



స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనడం మరచిపోలేని అనుభవమని యాడికి హైస్కూల్ విద్యార్థి అనిల్ కుమార్ అన్నాడు. తాడిపత్రి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనిల్, స్పీకర్ ఎన్నికకు ప్రతిపాదన చేశాడు. స్పీకర్‌గా ఎన్నికైన విద్యార్థిని పోడియం వద్దకు తీసుకువెళ్లి.. గౌరవంగా కూర్చోబెట్టే అవకాశాన్ని దక్కించుకున్నాడు. కూటమి ప్రభుత్వం ఇలా తమ చేత అసెంబ్లీ నిర్వహించడం చాలా గొప్ప విషయమని అనిల్ అన్నాడు.

- తాడిపత్రి ఎమ్మెల్యే అనిల్‌కుమార్

గుంతకల్లు ఎమ్మెల్యే.. స్వప్న



అసెంబ్లీలో కూర్చున్న స్వప్న

స్టూడెంట్ అసెంబ్లీలో గుంతకల్లు ఎమ్మెల్యేగా గుత్తి ఆర్ఎస్ బాలికోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని స్వప్న పాల్గొంది. అసెంబ్లీ కార్యకలాపాల్లో తన బాధ్యతను నెరవేర్చింది. కానీ సమయాభావం కారణంగా మాట్లాడే అవకాశం రాలేదు.

చాలా సంతోషంగా ఉంది: ఉరవకొండ ఎమ్మెల్యే లోకేశ్



ఆర్థిక శాఖ మంత్రితో లోకేశ్

స్టూడెంట్ అసెంబ్లీలో ఉరవకొండ ఎమ్మెల్యేగా పాల్గొనడం సంతోషంగా ఉందని కౌకుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థి లోకేష్ అన్నాడు. విద్యార్థుల చేత అసెంబ్లీ నిర్వహించడం చాలా మంచి నిర్ణయమని ప్రభుత్వాన్ని ప్రశంసించాడు. తమను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పలకరించారని తెలిపాడు. తనకు మాట్లేడికి అవకాశం దొరకలేదని, కానీ అసెంబీలో పాల్గొనడం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నాడు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశామని తెలిపాడు.

లోకేశ్‌తో కలిసి భోజనం చేశాం..



'అసెంబ్లీలో బిల్లులు ఎలా ప్రవేశపెడతారో తెలుసుకున్నాను. ప్రొటెం స్పీకర్, స్పీకర్‌ను ఎలా ఎన్నుకుంటారో చూశాను..' అని సంతోషంగా చెప్పింది వైష్ణవి. నంబులపూలకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వైష్ణవి.. కదిరి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో పాల్గొంది. తనకు ఇది గొప్ప అవకాశమని తెలిపింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబు సహా అందరూ తమతో మాట్లాడారని, తమతో కలిసి మంత్రి లోకేశ్ భోజనం చేశారని తెలిపింది. 'నన్ను కాదని మరొకరిని స్టూడెంట్ అసెంబ్లీకి ఎంపిక చేసినప్పుడు నేను ఎక్స్‌లో మీకు విషయం చెప్పాను..' అని లోకేశ్‌కు వివరించానని, ఆయన సంతోషం వ్యక్తం చేశారని, బాగా చదువుకోవాలని సూచించారని తెలిపింది.

నిజమైన అసెంబ్లీలా..



స్టూడెంట్ అసెంబ్లీ అసలైన అసెంబ్లీలా కనిపించింది. ధర్మవరం ఎమ్మెల్యేగా హాజరయ్యాను. అసెంబ్లీలో స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ఏ విధంగా వ్యవహరిస్తారో కళ్లకు కట్టినట్టు చూశాను. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. సమాజంలో జరుగుతున్న విషయాలు మాకు తెలుస్తాయి. సమస్యలను ప్రస్తావించడానికి నేను సిద్ధమయ్యాను. కానీ అవకాశం ఇవ్వకపోవడంతో కొంచెం బాధపడ్డాను.

- జశ్వంత్, ధర్మవరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి

చాలా బాగుంది..



స్టూడెంట్ అసెంబ్లీలో మాట్లాడానికి నాకు అవకాశం రాలేదు. కొంత బాధగా ఉంది. కొత్తచెరువు మండలం తలమర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీకి వెళ్లాను. ప్రతిపక్షం, పాలక పక్షం ఎమ్మెల్యేల వాదోపవాదాలు, ప్రజా సమస్యలపై నిలదీయడం, మంత్రులు సమాధానం చెప్పడం.. స్పీకర్ సమన్వయం చేయడం చాలా బాగా అనిపించింది. నాకు అవకాశం వచ్చి ఉంటే ప్రభుత్వ విద్యావిధానం గురించి ప్రస్తావించేదాన్ని.

- నిషిత, పుట్టపర్తి స్టూడెంట్ ఎమ్మెల్యే

పోడియం వద్ద పెనుకొండ ఎమ్మెల్యే



జయవర్ధన్‌ను అభినందిస్తున్న మంత్రులు నారా లోకేశ్, సవిత

'ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటాలి' అని ప్రభుత్వం అసెంబ్లీటల బిల్లు ప్రవేశ పెట్టగా ప్రతిపక్ష ఎమ్మెల్యే లు వ్యతిరేకిస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. అందులో పెనుకొండ ఎమ్మెల్యే జయవర్ధన్ కూడా ఉన్నాడు. రొద్దం మండలం కోగిర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జయవర్ధన్, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా వ్యవహరించాడు. 'తమ పార్టీ' ఎమ్మెల్యేలతో కలిసి స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశాడు. విద్యార్థులు చదువుకోకుండా మొక్కలు నాటాలని బిల్లులు ప్రవేశపెట్టడం దారుణమని, ప్రభుత్వమే మొక్కలను నాటాలని డిమాండ్ చేశాడు. జయవర్ధన్ ప్రతిభనుచూసి పెనుకొండ అసలైన ఎమ్మెల్యే, మంత్రి సవిత అభినందించారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. కంచిసముద్రం గ్రామానికి చెందిన జయవర్ధన్ అసెంబ్లీలో అదరగొట్టడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్లోరైడ్ సమస్యను చెప్పాలనుకున్నా..



'స్టూడెంట్ అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వచ్చుంటే మా నియోజకవర్గంలో ఉన్న ఫ్లోరైడ్ సమస్యను చెప్పాలని అనుకున్నాను. కానీ అవకాశం రాలేదు. స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనడం జీవితంలో మరచిపోలేని అనుభూతి..' అని మడకశిర స్టూడెంట్ ఎమ్మెల్యే సంధ్య చెప్పింది. ఎస్.రాయాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తను పదో తరగతి చదువుతోంది. తాగునీరు, రహదారుల సమస్యపై మాట్లాడేందుకు సిద్ధమై వెళ్లానని, కానీ అవకాశం రాలేదని తెలిపింది.



ఓపీ చీటీ కోసం బారులు తీరిన జనం



మూసివేసిన రేడియాలజీ విభాగం

దిక్కులేని రోగులు

(5వ పేజీ తరువాయి)

గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీజి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సీటీవీఎస్, బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ మొత్తం 17 విభాగాలున్నాయి. వీటిలో కార్డియాలజీ, ఎండో క్రైనాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, సీటీవీఎస్, రేడియాలజీ ప్రధానమైనవి. ఒక్కో విభాగ ఓపీకి నిత్యం 200మంది నుంచి 400మందికి పైగా రోగులు వస్తున్నారు. స్కానింగ్, అపరేషన్, డయాలసిస్ తదితర వైద్యసేవలు అవసరమైన రోగులను వార్డు(ఐపీ)ల్లో అడ్మిట్ చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలోని రోగులు, ఆపరేషన్ చేసిన రోగులు, డయాలసిస్ రోగులకు ఆయా విభాగాల ఐసీయూల్లో వైద్యసేవలందిస్తున్నారు. వీరిని ఉదయం, మధ్యాహ్నం, రాత్రివేళ క్రమం తప్పకుండా సంబంధిత డాక్టర్ పరీక్షించాలి. పరిస్థితిని బట్టి బాధితులకు అవసరమైన స్కానింగ్‌లు రాయడం, మందులు పెట్టడం చేయాలి. అయితే ఉదయం ఓపీల్లోనే అలసిపోతున్న డాక్టర్లు అనేకమంది ఐపీ, ఐసీయూ రౌండ్స్‌కు వెళ్లడం లేదు. ప్రాణాలు పోతున్నాయని వాపోతేమాత్రమే డ్యూటీలోని సిబ్బందికి ఫోన్‌చేసి ఫలానా ఇంజక్షన్, మాత్ర ఇవ్వాలని చెబుతున్నారని రోగులు కన్నీటి పర్యంతరమౌతున్నారు.

పీజీలు, హౌస్‌సర్జన్లు ఎక్కడ..?

ప్రభుత్వ వైద్య కళాశాలకు బోధనాస్పత్రులుగా సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. ఈ రెండు ఆస్పత్రుల్లోనూ వైద్య కళాశాల డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ)విద్యార్థులు, ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు(హౌస్‌సర్జన్స్) పనిచేస్తున్నారు. విభాగాల వారిగా సంబంధిత డాక్టర్ల వద్ద ప్రాక్టీస్ చేయడం, అభ్యసించడం పీజీ, హౌస్‌సర్జన్ విద్యార్థుల విధి. ఆ మేరకు సర్వజన వైద్యశాలలో విద్యార్థులకు డ్యూటీలు వేస్తున్నారు. కానీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డ్యూటీలు వేయడంలేదని డాక్టర్లు చెబుతున్నారు. 'ఓపీలలో స్కానింగ్‌ల నుంచి మందుల చీటీల వరకు మేమే రాయాలి. ఐపీ, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ ఇలా అన్ని దగ్గరుండి చూసుకోవాలి. డాక్టర్లంటే మేమూ మనుషలమే ఎలా పనిచేయాలి' అని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వైద్య పోస్టుల ఖాళీల భర్తీకి చొరవ చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

డ్యూటీలు వేస్తున్నాం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్లకు సహాయకంగా పీజీ, హౌస్‌సర్జన్స్‌కు డ్యూటీలు వేస్తున్నాం. ఆ మేరకు వారు డ్యూటీలకు వెళ్తున్నారు. డ్యూటీలు చేస్తున్నట్లు విద్యార్థులు కూడా చెబుతున్నారు. వెళ్తున్నారా? లేదా? విచారణ చేస్తాం. అదేవిధంగా డాక్టర్ల కొరత, రోగుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో పంపాం. త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

-డాక్టర్ విజయశ్రీ, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్



కార్డియాలజీ ఐసీయూలో చికిత్సలు పొందుతున్న రోగులు

విభాగాల వారిగా ఖాళీల సంఖ్య...

విభాగం	ప్రొఫెసర్	అసోసియేట్	అసిస్టెంట్
అనస్థిషియా	1	1	0
కార్డియాలజీ	1	0	1
ఎండో క్రైనాలజీ	0	1	2
మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ	1	1	2
న్యూరో సర్జరీ	0	1	0
న్యూరాలజీ	1	1	0
నెఫ్రాలజీ	1	0	2
యూరాలజీ	1	0	0
సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ	1	1	0
సీటీవీఎస్	1	0	1
బయోకెమిస్ట్రీ	1	0	1
పెథాలజీ	1	0	1
మైక్రోబయాలజీ	1	0	1
రేడియాలజీ	1	1	0
ఎమర్జెన్సీ మెడిసిన్	0	0	2
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్	1	1	2
ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్	0	0	1
మొత్తం ఖాళీలు	**13**	**8**	**16**

పంచాయతీనే కావాలి..!

(5వ పేజీ తరువాయి)

రూరల్-అర్బన్ కేటగిరిలో చేర్చారు. వీటికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులనే నియమిస్తారా.., డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి అధికారిని కేటాయిస్తారా.. అన్నదానిపై స్పష్టత లేదు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందినవారు, ఆ జాబితాలో ఉన్నవారు సైతం రూరల్-అర్బన్ పంచాయతీలను వదిలి వెళ్లడానికి సుముఖత చూపడం లేదన్న చర్చ జరుగుతోంది. సాధారణ ఉద్యోగోన్నతుల్లో భాగంగా డిప్యూటీ ఎంపీడీఓ అయినవారు కూడా.. వదిలి వెళ్లడానికి నిరాకరిస్తున్నారని తెలుస్తోంది. నూతనంగా మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారి నియామకంలో భాగంగా చాలామంది గ్రేడ్-1, ప్రస్తుతం రూరల్-అర్బన్ పంచాయతీలుగా ఎపింకైన వాటిలో పనిచేసే కార్యదర్శులకు అవకాశం కల్పిస్తారన్న చ ర్చ సాగుతోంది. దీంతో ప్రస్తుతం ఉన్నవారితోపాటు, ఇప్పటికే ఆ స్థానం నుంచి ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపీడీఓలుగా వెళ్లినవారు సైతం తిరిగి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగోన్నతి వదులుకోవడానికి కూడా సిద్ధపడ్డారన్న చర్చలు వినిపిస్తున్నాయి. మండల గ్రామ-వార్డు సచివాలయ అధికారిగా డెప్యుటేషన్‌పై వెళ్తే అక్కడ పెద్దగా పని ఉండదని భావించి తమ పలుకుబడి వినియోగించుకుని ఇక్కడే మకాం వేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం మండలాల కేటాయింపునకు సైతం ఆప్షన్ ఇవ్వడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఉద్యోగోన్నతి నిరాకరించిన వారికి కొందరు సీనియర్లు.. ఎందుకు వదులుకుంటారని హితబోధ చేస్తున్నారని ఆ వర్గాల సమాచారం. దీంతో ఉద్యోగోన్నతి కావాలి.. పంచాయతీ నాదే అన్న రీతిలో ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందిన వారిని తిరిగి అదే పంచాయతీకే కేటాయిస్తే.. ఇక తామేం చేయాలంటూ ప్రస్తుత కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో అంతా తామై వ్యవహరించిన వారు, డిప్యూటీ ఎంపీడీఓలుగా అధికారాల్లేకుండా కూర్చోవడానికి ఆసక్తి చూపట్లేదు. ప్రజాప్రతినిధులతో సఖ్యతగా ఉన్నవారి ద్వారా రూరల్-అర్బన్ పంచాయతీలో పాగావేసే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. కొందరు.. తమకు సన్నిహితంగా ఉన్న ప్రజాప్రతినిధుల వద్ద తిరిగి తామే వస్తామనీ, మరొకరికి అవకాశం ఇవ్వద్దని ఒప్పందాలు చేసుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం జారీచేసిన ఉద్యోగోన్నతుల జాబితాలో ఖాళీ అయ్యే స్థానాల కోసం పంచాయతీ కార్యదర్శులు.. స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదిస్తుండగా.. తమ వారే వస్తారని చెబుతుండడంతో షాక్‌కు అనవుతున్నారు.

జిల్లాలో 14 రూరల్-అర్బన్ పంచాయతీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం జిల్లాలో 14 రూరల్-అర్బన్ పంచాయతీలుగా తేల్చారు. వీటిలో అనంతపురం రూరల్ మండలంలోని నారాయణపురం, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేట, అనంతపురం రూరల్, రాచానపల్లితోపాటు బుక్కరాయసముద్రం, నార్పల, గన్నేవారిపల్లి, ఉరవకొండ, యాడికి, కంబదూరు, కణేకల్లు, పామిడి పంచాయతీలున్నాయి. వీటిపై డిప్యూటీ ఎంపీడీఓల కన్ను పడిందన్న చర్చ జరుగుతోంది. ఈ ప్రాంతాల్లో పనిచేసి ఇప్పటికే ఉద్యోగోన్నతి పొందిన వారు, ఇక్కడే పనిచేస్తూ ప్రమోషన్ జాబితాలో ఉన్నవారు జోడు పదవులు నిర్వహించడానికి పైరవీలు సాగిస్తున్నారని ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పైరవీలదే పైచేయి అవుతుందా..? అర్హులకు న్యాయం చేకూరుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

పెళ్లికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు

- కారు, కంటైనర్ ఢీ.. ఇద్దరి మృతి
- మృతులు శ్రీసత్యసాయి జిల్లావాసులు


నుజ్జయిన కారు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్లి.. బంధువులతో కలిసి సంతోషంగా గడిపారు.. ముహూర్తం చూసుకుని కారులో తిరిగి వస్తుండగా అంతలేనే మృత్యువు కబళించింది. ముంబై-చెన్నై జాతీయ రహదారిలో కారు, కంటైనర్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం సాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చాపిరెడ్డి వెంకటరమణ (65), చాపిరెడ్డి రాజశేఖర్ (40) ఇద్దరూ బంధువులు. కొన్నేళ్లుగా ఇరు కుటుంబాలు మదనపల్లెలో నివాసముంటున్నాయి. సీవీ వెంకటరమణ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొంది చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. సీవీ రాజశేఖర్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం తవళంలో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి కారులో వెళ్లారు. బుధవారం ఉదయం ముహూర్తం చూసుకుని తిరిగి కారులో మదనపల్లెకు బయలు దేరారు. ఈ క్రమంలో వేపూరికోట వద్ద కారు, కంటైనర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందారు. మృతదేహాలు కారులోనే ఇరుక్కుపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంలో అతికష్టం మీద బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశులు, ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


నారాయణ స్వామి (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద ముష్టూరు గ్రామ కౌలు రైతు నారాయణస్వామి(40) అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణస్వామి తన తల్లి పేరిట ఉన్న రెండు ఎకరాలు, కౌలు పొలం ఐదు ఎకరాలలో మిరప, వేరుశనగ, కంది పంటలను సాగు చేసేవాడు. మూడేళ్ల నుంచి పంట నష్టపోవడంతో అప్పులు రూ.10 లక్షల దాకా పేరుకుపోయాయి. వాటిని తీర్చే మార్గం లేక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి, ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


గుర్తుతెలియని వ్యక్తి దేహం

కదిరి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గూడ్స్ షెడ్ సమీపాన గల చింత చెట్టుకింద ఓ వ్యక్తి మృతిచెంది ఉండడంతో స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని, పరిశీలించారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని సీఐ తెలిపారు. తెలుపు టీషర్టు, నలుపురంగు కాటన్ ప్యాంటు ధరించినట్లు చెప్పారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసు స్టేషన్‌లోగానీ, 9440796851 నంబరులో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు


జుజారు మణి (ఫైల్)

ధర్మవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మరణించిన ఓ వ్యక్తి నేత్రదానం చేసి ఇద్దరికి వెలుగులు నింపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన జుజారు మణి(40) బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. దీంతో విశ్వదీపాసేవాసంఘం సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు నేత్ర వైద్య నిపుణుల సహకారంతో కంటి కార్నియా సేకరించారు. నేత్రదానానికి అంగీకరించిన మృతుడి భార్య లక్ష్మి, కుమారులు కార్తీక్, దినకర్, సోదరులు జుజారు తాయప్ప, తాయేంద్ర, రఘులకు విశ్వదీపాసంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వదీపాసేవాసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, సంఘం పట్టణ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జుజారు రఘు, నాగార్జున, ఆదినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నా ఇష్టం వచ్చినప్పుడు ఇస్తా..!

తహసీల్దార్ దురుసు ప్రవర్తన.. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నల్లచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'ఆఫీస్ నుంచి మర్యాదగా బయటికిపో. నాకు ఇష్టం వచ్చినప్పుడు ఇస్తా' అని తహసీల్దార్ దురుసుగా ప్రవర్తించాడని ఎమ్మెల్యే కందికుంటకు ఫిర్యాదు చేసినట్లు ఓ బాధితుడు తెలిపాడు. కె.పూలకుంట సచివాలయంలో దామలవాండ్లపల్లికి చెందిన మల్లికార్జున తన కుటుంబ సభ్యుల పేరు మీద పొజిషన్ సర్టిఫికెట్ కోసం గత నెల 31న దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామ సర్వేయర్ ద్వారా ఇంటి స్థలాన్ని సర్వేచేయించుకొని సర్వే పత్రాలు సైతం తహసీల్దార్ కార్యాలయానికి అందజేసినట్లు తెలిపాడు. వీఆర్ఓ లాగిన్‌కి ఈ నెల 13న మార్చారు. అప్పటి నుంచి ప్రతి రోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, పత్రాలన్నీ సరిగా ఉన్న తహసీల్దార్ లాగిన్‌లో ఆమోదించలేదని మల్లికార్జున ఫిర్యాదులో పేర్కొన్నాడు. హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వరకే గడువు ఉండటంతో బుధవారం కార్యాలయానికి వచ్చి పొజిషన్ సర్టిఫికెట్ గురించి తహసీల్దార్‌ను అడిగానన్నారు. దీంతో తహసీల్దార్ ఆఫీస్ నుంచి బయటకు వెళ్లు అంటూ దురుసుగా ప్రవర్తించాడని బాధితుడు మల్లికార్జున ఎమ్మెల్యేకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ఫిర్యాదును కదిరిలో ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేసినట్లు తెలిపాడు. ఈ విషయమై తహసీల్దార్ జమానుల్లాఖాన్‌ను వివరణ కోరగా ఆఫీస్‌లో గట్టిగా మాట్లాడవద్దని, అలా మాట్లాడేవారు ఎవరైనా ఉంటే బయటకు వెళ్లాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా లక్ష్మీప్రసాద్ ప్రమాణం

హాజరైన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు


ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు

అనంతపురం క్రైం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన చల్లా లక్ష్మీప్రసాద్‌బాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో ఏపీఐఐసీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్, తోటి డైరెక్టర్లతో కలిసి అనంతపురానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, అనంతపురం, మడకశిర ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు హాజరయ్యారు. చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. లక్ష్మీప్రసాద్ బాబుకు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ....తన గెలుపునకు చల్లా లక్ష్మీప్రసాద్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనకు డైరెక్టర్ పోస్టు దక్కడం, ప్రమాణ స్వీకారానికి తాను హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఏపీఐఐసీ గతంలో కంటే భిన్నంగా పనిచేస్తోందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీకి భారీగా పరిశ్రమలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో ఏపీఐఐసీ మరింత మెరుగ్గా పనిచేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సోషలిస్టు పాలనతోనే దేశ పురోగతి

ప్రజాహక్కులను నెరవేరిస్తేనే అభివృద్ధి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఘనంగా రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు


కవాతు నిర్వహిస్తున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు, సీపీఎం నాయకులు


ప్రసంగిస్తున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

అనంతపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోషలిస్టు పాలనతోనే దేశం పురోగతి వైపు అడుగులు వేస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. ప్రథమ సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి క్లాక్‌టవర్ మీదుగా లలితకళాపరిషత్ వరకు రెడ్‌షర్ట్ వలంటీర్స్ కవాతు నిర్వహించారు. అనంతరం పరిషత్ ఆవరణలో పలువురు కళాకారులు ఎర్రజెండా పాటలకు నృత్యాలతో అలరించారు. తదనంతరం 'సోషలిజం ఔన్నత్యం - సామ్రాజ్యవాద ప్రమాదం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో బీవీ రాఘవులు మాట్లాడారు. సోషలిజంతో ఎంత మేలు జరుగుతుందనే దానికి రష్యా నిదర్శనమన్నారు. రష్యాలో విద్య, వైద్యం, ఉపాధి వంటివి అందరికీ నాణ్యమైన పద్ధతిలో సమాన హక్కుగా ఉండగా... భారతదేశంలో మాత్రం ఆరోగ్యాన్ని, విద్యను వ్యాపారం చేయడంతోపాటు ప్రభుత్వ భూములను అమ్మి సొమ్ము చేసుకునే పాలకులున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ బడాబాబులకు వత్తాసు పలికేవారే తప్ప.. సామాన్య ప్రజలు, కార్మికులు, రైతాంగానికి న్యాయం చేసే పాలకులు కనిపించడలేదన్నారు. జబ్బులురాని మంచినీరు కూడా లభించని దౌర్భాగ్య సమాజంలో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దేశ మహిళల్లో రక్తహీనత ప్రభావం ఎక్కువగా ఉందనీ, ఇలా మరే దేశంలోనూ లేదని పేర్కొన్నారు. ప్రజల హక్కులైన నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యం, సొంత ఇల్లు, ఉద్యోగం, వృద్ధులకు పింఛన్, వ్యవసాయం చేసే ప్రతిఒక్కరికీ భూమి తదితరాలను నెరవేర్చినపుడే దేశం అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. వ్యవస్థలోని సమస్యలన్నింటిపై ప్రభుత్వంతో పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

మహిళలకు భద్రత ఏదీ: రాంభూపాల్

మహిళలు, యువతులు బయటకు వెళ్తే ఇంటికి క్షేమంగా తిరిగొస్తారా.. లేదా.. అనే అభద్రత నడుమ బతుకుతున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. రూ.లక్షలు వెచ్చించి పిల్లలను చదివిస్తే వారికి ఉద్యోగం వస్తుందనే నమ్మకం కూడా లేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మోసాలు, దౌర్జన్యాలు చేసినవారే రాజ్యాధికారం చేపడుతుండడం బాధాకరమన్నారు. దేశానికి కావాల్సింది మతతత్వం కాదు, మత సామరస్యం అన్నారు. కేంద్రంలో 11 సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని తెలిపారు. కార్పొరేట్లకు మద్దతుగా కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోనూ రైతాంగం అనేక సమస్యలతో కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పాలకుల్లో స్పందన లేదన్నారు. జిల్లాలో అరటి ధర పడిపోవడంతో పంటను ఏమీ చేసుకోలేక బాధాతప్త హృదయాలతో రైతులు పంటను దున్నేసుకుంటున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.40వేల కోట్లు రావాల్సుండగా ఇప్పటి వరకు రూ.12వేల కోట్లు మాత్రమే సాధించుకోగలిగారన్నారు. వైసీపీ అధినేత రోడ్ల మీదకు వచ్చి హడావుడి చేయడమే తప్ప.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించడం లేదన్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే తనకు ఏమౌతుందో తెలుసు కాబట్టే జగన్ బీజేపీని ప్రశ్నించే ధైర్యం చేయట్లేదని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం.. మావోయిస్టులను పిట్టల్ని కాల్చేసినట్లు కాల్చేస్తే సీపీఎం సహించదని హెచ్చరించారు. వారితో శాంతియుతంగా చర్చలు జరిపాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ... పాలకవర్గాల విధానాలు ప్రజల పాలిట ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో భూములు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోవడం ద్వారా వ్యవసాయం తగ్గిపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదం అంతరించిపోయే దశకు చేరుకుంటున్న ఈ తరుణంలో దేశ రక్షణకు సోషలిస్టు పాలన తప్ప.. ప్రత్యామ్నాయం లేదన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం రాష్ట్ర నేత ఓబులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, ఆర్‌వీ నాయుడు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

కృష్ణాజలాలతో బంగారు పంటలు

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బుక్కపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాలలో రైతులు బంగారు పంటలు పండించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆకాంక్షించారు. హంద్రీనీవా కాలువ ద్వారా బుక్కపట్నం చెరువుకు కృష్ణాజలాలు వదులుతున్నారు. చెరువు పూర్తిగా నిండి, మరువపోతోంది. దీంతో బుధవారం చెరువు కట్టపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జలహారతి ఇచ్చారు. తూముల ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుక్కపట్నం చెరువు 0.5 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో జలకళ సంతరించుకుందన్నారు. చెరువు కింద ప్రత్యక్షంగా 3 వేల ఎకరాలు, పరోక్షంగా మరో 10 వేల ఎకరాలు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపుతామన్నారు. బుక్కపట్నం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డీపీఆర్ తయారు చేయాలని బాబా శతజయంతి వేడుకలకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్‌కు ఆదేశించడం హర్షణీయమన్నారు. చెరువులో జంగిల్ క్లియరెన్స్ పనులు ఒచేపట్టి, కొండవైపు దేవాలయానికి రోడ్డు నిర్మిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. స్లూయిజ్ గేట్ ఎత్తి, ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు సంజీవరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ మల్లిరెడ్డి, టీడీపీ నేతలు గంగాధర్, సామకోటి ఆదినారాయణ, కొత్తచెరువు కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బుక్కపట్నం సింగిల్ విండో అధ్యక్షుడు చెన్నకృష్ణ, మాజీ సర్పంచ్ యశోదరాయుడు, లావణ్య పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలతో రైతుల్లో ఆనందం


హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

నంబులపూలకుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలో చెరువులు కృష్ణా జలాలతో నింపడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని పడమరనడింపల్లి, గౌకనపేటలో బుధవారం అధికారులు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరైతు చూసి నా ఆనందం వ్యక్తం చేశారు. మూడు చెరువులకు నీరు వచ్చిందని.. ఖరీఫ్, రబీలో పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉంటుందని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా కరువుతో సతమతమయ్యమన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌తో గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా అనుకూలంగా ఉండే చెరువులను నింపుకుంటూ తలుపుల మండల మీదుగా ఎన్పీకుంటలోని చెరువులు నింపుతున్నట్లు వారు పేర్కొన్నారు. చెరువులకు నీటిని నింపడంతో బీళ్లు సైతం సాగుచేసుకుని జీవిస్తామని, రైతులు ఇక ఎక్కడికి వలసలు వెళ్లాల్సిన అవసరంలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పట్టణాలకు వలసలు వెళ్లారు. వారు స్వగ్రామాలకు వచ్చి పంటలు సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం పొలం పిలుస్తోంది. పొలంబడి, క్లస్టర్ డెమో, మట్టిన మూనా సేకరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. రైతులకు సరిపడే యూరియాను కొరత లేకుండా సరఫరా చేస్తోందన్నారు. ఏడు రోజులపాటు జరిగే రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రైతులు విజయ్‌కుమార్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

శభాష్ కుసుమ..!

కిలిమంజారో పర్వతారోహకురాలిని అభినందించిన సీఎం


సీఎం చంద్రబాబుకు చిత్రపటం అందజేస్తున్న కుసుమ

శింగనమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'కుసుమ..శభాష్.! ఇదే పట్టుదలతో నీవు కృషి చేస్తే తప్పకుండా ఎవరెస్ట్ ఎక్కుతావు. నీకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది' అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. నార్పల మండల దుగ్గుమర్రికి చెందిన కుసుమ ఇటీవల ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె తన కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. పర్వతారోహణ అనంతరం అక్కడ తీసుకున్న ఫొటోను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అండగా ఉంటుందని, కుసుమ పట్టుదల చూస్తే ఎవరెస్టు పర్వతాన్ని తప్పకుండా అధిరోహిస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు. కుసుమకు భవిష్యత్తులో అన్నివిధాలుగా అండగా ఉంటామని ఆమెకు ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

చట్టాలకు మూలాధారం.. రాజ్యాంగం

జడ్పీ చైర్‌పర్సన్


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోని చట్టాలన్నింటికీ మూలాధారం రాజ్యాంగమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించగలుగుతున్నారంటే అది రాజ్యాంగం గొప్పతనం అన్నారు. అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, వాటిలోని విశిష్టమైన అంశాలను తీసుకుని దేశ ప్రజలకు ఉపయోగపడేలా ప్రతిష్టాత్మకంగా అప్పట్లో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓలు ప్రభాకర్, తేజోత్స్న, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున, శ్రీవాణి, మాధవి, అరుణకుమారి పాల్గొన్నారు.

'వద్ది'కి పదవి

అఖిల భారత పద్మశాలి సంఘం తిరుపతి అన్నసత్రం అధ్యక్షుడిగా ఎంపిక



తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి సంఘం తిరుపతి అన్నసత్రం అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తాడిపత్రికి చెందిన వద్ది శివసత్యనారాయణ పేర్కొన్నారు. తిరుపతిలో బుధవారం జరిగిన అఖిల భారత సేవా కమిటీ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ధర్మకర్త, జనరల్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పదవులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అన్నసత్రం అధ్యక్షుడి పదవి రావడం ఎంతో గర్వకారణమన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు డిసెంబరు 10వరకు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం తెలిపారు. జిల్లాలో సెయింట్ మేరీ బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (అనంతపురం)లో ఎస్ఏ బయాలజీ, ఎస్ఏ తెలుగు, ఎల్‌పీటీ తెలుగు, ఎల్‌పీటీ హిందీ, పీఈటీ పోస్టులు ఉన్నాయన్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్(అనంతపురం)లో ఐదు ఎస్జీటీ పోస్టులు ఉన్నాయన్నారు. మహిళలే అర్హులన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసిందన్నారు. దానిని డిసెంబరు 10 వరకు పొడిగించామన్నారు.

పది పరీక్షల ఫీజు గడువు సైతం..

పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగించనట్లు డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు అపరాధ రుసుంలేకుండా ఫీజు కట్టవచ్చన్నారు. 11 నుంచి 12 వరకు రూ.25 అపరాధ రుసుంతో, 15వరకు రూ.50 ఫైన్‌తో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు.

ట్యాలీ ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ యువతకు బెంగళూరులో ఉచితంగా కంప్యూటర్ ట్యాలీ కోర్సులో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. డిసెంబరు 1 నుంచి 35రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

నేడు జైళ్లశాఖ ఐజీ రాక

బుక్కరాయసముద్రం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసులు రానున్నట్లు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్ వసంతకుమార్ తెలిపారు. జైలులో గురువారం నిర్వహిస్తున్న వేలం పాటలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు. జైలుకు సంబంధించి 36 ఎద్దులు, 1600 చింత చెట్లు, 400 సపోటా చెట్లకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపైనే శిక్షణ

జడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన అంశంగా డీడీఓలకు శిక్షణ ఇచ్చారని జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎంపీడీఓ నుంచి ఇటీవల డివిజనల్ అభివృద్ధి అధికారి(డీడీఓ)గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన.. 15 రోజుల పాటు విజయవాడలో శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగించుకుని వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన అంశంగా శిక్షణ ఇచ్చారన్నారు. అందులో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నానన్నారు. వనరులను గుర్తించి, వాటి ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చడంపై శిక్షణ ఇచ్చారన్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను ద్వారా సమకూరే సొమ్మును పూర్తిస్థాయిలో రాబడితే పంచాయతీలకు నిధుల కొరతే ఉండదన్నారు. మంచినీటి సరఫరాపై వివరించారని ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్

పెట్టుబడిదారుల కోసమే లేబర్ కోడ్‌లు

● సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

● లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ సీఐటీయూ నిరసన



ర్యాలీలో మాట్లాడుతున్న రాఘవులు

కదిరి అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పాత చట్టాలలో ఉన్న కొద్ది పాటి హక్కులను కూడా రద్దు చేసి పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని సీపీఎం పొలిట్ సభ్యుడు బీవీ రాఘవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. కార్యక్రమానికి బీవీ రాఘవులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు ఈ లేబర్ కోడ్‌ల అమలు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జీఎల్ నరసింహులు, నాయకులు లక్ష్మీనారాయణ, సాంబశివ, బాబ్జాన్, రామ్మోహన్, ముస్తాక్, రాజారెడ్డి, నాగరాజు, బడా సుధాకర రెడ్డి, అంగన్‌వాడీ నాయకురాళ్లు సుజాత. ప్రమీలమ్మ, రంగమ్మ, రాధ, మోక్షప్రియ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులకు వ్య తిరేకమైన లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని ఏఐయూటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. పుట్టపర్తి గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు కార్మిక సంఘాల నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నాయ కులు మాట్లాడుతూ ఉన్న చట్టాలను తుంగలో తొక్కి కొత్త చట్టాలతో కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పరిపాలన కార్పొరేట్‌ల కోసమే కాని సామాన్యులకు కాదన్నారు. కార్మకులకు వ్యతిరేకమైన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ లో డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐయూటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా నాయకులు వెంకటేష్, రైతు సంఘం జిల్లాకార్యదర్శి మహదేవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, రాము, చలపతి, గోవిందరెడ్డి, అశోక్, కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజులు కోర్టు విధుల బహిష్కరణ

● న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప

కదిరి లీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో వాదించడానికి వచ్చిన బళ్లారికి చెందిన న్యాయవాది కొర్రేసుపై కొందరు దాడి చేయడాన్ని నిరసిస్తూ రెండు రోజుల పాటు కోర్టు విధులు బహిష్కరించేందుకు తీర్మానించినట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే చౌడప్ప బుధవారం తెలిపారు. కదిరిలో కూడా గురు, శుక్రవారాల్లో కోర్టుల విధులను బహిష్కరించి నిరసన తెలపడానికి తీర్మానించామన్నారు. శనివారం ఆర్డీఓ కోర్టు విధులనూ న్యాయవాదులు బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సునీల్ వైట్ల మృతి తీరనిలోటు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్



భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న జీఎం శేఖర్ తదితరులు

పుట్టపర్తిరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సునీల్‌వైట్ల బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ బుధవారం ఉదయం పుట్టపర్తిలోని సునీల్‌వైట్ల ఇంటికి వెళ్లి, భౌతిక కాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి, పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. సునీల్ వైట్ల అకాల మరణం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. అలాగే మంత్రి సత్య కుమార్ యాదవ్ కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు, సీనియర్ నాయకులు రొద్దం ఉత్తమ్ రెడ్డి, సుదర్శన్, జిల్లా కార్యదర్శి హరికృష్ణగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

సునీల్‌వైట్ల మృతి అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆవేదన వ్యక్తం చే శారు. సునీల్‌వైట్ల మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి వారి ఇంటికి వెళ్లి సునీల్‌వైట్ల కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢసానుభూతిని తెలియచేశారు. టీడీపీ నాయకులు చలపతి, ఓబులేసు, గంగాదర్‌నాయుడు, బీజేపీ నాయకులు ఉన్నారు.

హాకీ పోటీల్లో చిగిచెర్ల విద్యార్థుల సత్తా



సత్తాచాటిన విద్యార్థులతో పీడీ ప్రతాప్

ధర్మవరం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీపోటీలలో సత్తాచాటి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించడంలో ముందంజలో నిలిచారని పాఠశాల పీడీ ప్రతాప్ బుధవారం తెలిపారు. ఈనెల 22నుంచి 24వరకు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పాల్గొని అవార్డులు పొందినట్లు తెలిపారు. కావ్యశ్రీ, భాను శ్రీ, మనోజ్, అభినాష్, అజయ్ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. మనోజ్ బెస్ట్‌ప్లేయర్ అవార్డు సాధించాడు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

ఇళ్ల సమీపంలో చెత్తకుప్ప



తూపల్లి రహదారిలో వేసిన చెత్త

గాండ్లపెంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, పరిశుభ్రత అంటూ అధికారులు ఫొటోలకు ఫోజులు ఇస్తారు కానీ ఆచరణ, అమలు పట్టించుకోరని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. దీంతో గ్రామాల్లో పరిశుభ్రత, చెత్త నుంచి సంపద సృష్టి, తద్వారా పంచాయతీల అభివృద్ధి అనే ప్రభుత్వ లక్ష్యాన్ని పాలకులు, అధికారులు తుంగలో తొక్కేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. వీధుల్లోని చెత్తను తొలగించేందుకు ప్రభుత్వం ప్రతి పంచా యతీకి పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసింది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు కూడా అంతంత మాత్రంగానే విధులు నిర్వహిస్తున్నారు. వారు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను సేకరించి, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రానికి తరలించడం లేదు. ఆ గ్రామానికి సమీపంలోనే వేస్తున్నారు. దీంతో సమీప ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గాండ్లపెంట మండల కేంద్రంలోనే ఈ సరిస్థితి కనిపిస్తోంది. మండలకేంద్రంలోని ప్రధానరహదారిలో టీ హోటళ్లు, కిరాణా దుకాణాలు, వివిధ షాపుల్లోని చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాని తరలించడం లేదరు. సేకరించిన చెత్తను మలమీదపల్లి, తూపల్లి రహదారి పొడువునా వేస్తున్నారు. దీంతో చెత్త పేరుకు పోయి రోడ్డు పైకి వస్తోంది. ఆ చెత్త కుప్ప వర్షాలకు కుళ్లి, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సమీపంలోని నివాస గృహాల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాగే వదిలేస్తే రోగాల భారిన పడతామని వారు వాపోతున్నారు. అంతేగాకుండా చెత్త ఉన్న సంచులను కుక్కలు రోడ్డు పైకి లాక్కురావడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతు న్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్తన తొలగించాలని కోరుతున్నారు. ఆదేవిధంగా గ్రామంలో సేకరించిన చెత్తను గ్రామ సమీపలో పడేయ కుండా చెత్తసంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు, ప్రజలు కోరుతున్నారు.

లాభదాయకమైన పంటలు సాగుచేయండి

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె



రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బుక్కపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): లాభదాయకమైన పంటలు సాగుచేసి అధిక ఆదాయాన్ని పొందాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రైతులకు సూచించారు. మండలం కేంద్రమైన బుక్కపట్నంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతన్నా... మీ కోసం' కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో కృష్ణజలాలు తీసుకురావడం వల్ల అన్ని చెరువులు జలకళ సంతరించుకున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలనే సంకల్పంతో అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపడుతోంద తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్, మండల వ్యవసాయాధికారి నటరాజ్, మండల ప్రజా ప్రతినిధులు చెన్నకృష్ణ, యశోద, శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ మల్లిరెడ్డి, గంగాధర్, బాబు, దాసరి శ్రీనివాసులు, మంజు, వెంకటసుబ్బారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కపట్నంలో బుధవారం మృతిచెందిన పెదరాసు నాగభూషణం కుటుంబాన్ని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరామర్శించారు. పెదరాసు నాగభూషణం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్/ బుక్కపట్నం/ కొత్తచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింమైనార్టీల సంక్షేమానికి కూటమిప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాదరెడ్డి పేర్కొన్నారు. బుదవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తచెరువు మండలంలోని పలు మసీదుల్లో పనిచేస్తున్న నలుగురు మతపెద్దలకు రూ.3.60 లక్షల గౌరవవేతనం చెక్‌ను వారు అందజేశారు. అలాగే బుక్కపట్నం మండలం యర్లంపల్లి కి చెందిన 36 వైసీపీ కుటుంబాలు బుధవారం టీడీపీలోకి చేరాయి. వారికి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘు నాథరెడ్డి కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు.

ముందు టైరు పగిలి దూసుకెళ్లిన కారు



నుజ్జయిన ద్విచక్రవాహనం

ధర్మవరం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట బీసీకాలనీ వద్ద బుధవారం వెళ్తున్న కారు ముందుటైరు పగలడంతో రోడ్డు పక్కన ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ముందుకు దూసుకెళ్లింది. మామిళ్లపల్లి నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న కర్ణాటకకు చెంది న ఓ కారు వెళ్తోంది. ఉన్నఫళంగా కారు ముందు టైరు పగిలి రోడ్డుపక్కకు దూసుకుపోయింది. రోడ్డుపక్కన ధర్మవరం డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్ చంద్ర తన ద్విచక్రవాహనాన్ని నిలిపి మిత్రుడితో మాట్లాడుతున్నాడు. ఒక్కసారిగా కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు అయి కారు నిలిచిపోయింది. ప్రమాదంలో ఏ ఒక్కరికి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

భార్యపై కత్తితో దాడి

కదిరి అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో బుధవారం ఓ వ్యక్తి తన భార్యపై భర్త కత్తితో దాడి చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. శైలజ, నీలకంఠారెడ్డి దంపతులు గాండ్లపెంట మండలం రెక్కమానులో కాపురం ఉంటున్నారు. తరచూ వీరి మధ్య గొడవులు జరుగుతూ ఉండేవి. భార్య శైలజ కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో బంధువులు ఇంటికి వచ్చింది. భర్త కూడా అక్కడి చేరుకొని భార్యతో గొడవపడి కత్తితో దాడి చేయగా ఆమె మెడగకు గాయమైంది. స్థానికులు ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతన్నా.. మీకోసం ఊరూరా నిర్వహించాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



వీసీలో పాల్గొన్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని జిల్లాలో ఊరూరా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వ్యవసాయాధికారులతో కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని, ప్రతి రైతు ఇంటికి వెళ్లి ఐదు ప్రధాన సూత్రాలు, వాటి ఉద్దేశాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు బిందు సేద్యం పరికరాలు అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మౌర్యభరద్వాజ్, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

7న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో డిసెంబరు 7న నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకో వాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి, యువర్స్‌ఫౌండేషన్ సంయుక్తంగా ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సంబంధిత కరపత్రాలను బుధవారం స్థానిక స్వాతిక్లినిక్‌లో విడుదల చేశారు.

బీమా చెక్కు పంపిణీ

తాడిమర్రి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీలో రూ. 200 చెల్లించి సభ్యత్వం పొందిన మర్రిమేకలపల్లికి చెందిన పెద్దన్న ఆటో ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులకు టీడీపీ కార్యకర్తల సంక్షేమనిది నుంచి రూ.5లక్షల బీమా మంజూరైంది. ఈ చెక్కును బుధవారం బత్తలపల్లిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ కూచి రాము, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జనార్దన్, సురేంద్రనాయుడు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే టీడీపీ జాతీయ ప్రదాన కార్యదర్శి నారాలోకేశ్ పంపిన సందేశపత్రాన్ని అందజేశారు.

అందుబాటులో యూరియా

అమడగూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ సొసైటీ కార్యాలయంలో రైతులకు యూరియా అందుబాటులో ఉన్నట్లు సహకార వ్యవసాయ సొసైటీ చైర్మన్ కమ్మల నరేష్ తెలిపారు. మహమ్మదాబాద్ పంచాయతీలో యూరి యా యూరియా కావాల్సిన రైతులు గ్రామ సచివాలయంలో అగ్రి కల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి తీసుకోవచ్చని తెలిపారు. సోమ వారం నుంచి అందజేస్తామని ఏఓ వెంకటరమణాచారి తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

● సమైక్య పర్వదినం: న్యాయాధికారులు



కదిరి కోర్టులో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయాధికారులు

కదిరిలీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలకు నిలువుటద్దం భారత రాజ్యాంగమని, దేశప్రజల సమైక్య పర్వదినం రాజ్యాంగ దినోత్సవమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి పి. లోకనాథంతో కలసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అన్ని కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

● కదిరి : భారత రాజ్యాంగా దినోత్సవాన్ని పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. నాయకులు బాహద్దీన్, సిరి బాబాయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో కదిరి పట్టణంలోని అంబేడ్కర్ కూడిలిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● ధర్మవరం: భారత రాజ్యాంగం అత్యున్నత విలువలతో కూడినదని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రి న్సిపాల్ వనితావాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు. అలాగే శ్రీసాయి డిగ్రీకళాశాల, కొత్తపేట ఉషోదయ పాఠశాల, కాక తీ య విద్యానికేతన్, రిషీ విద్యాలయంలో రాజ్యాంగదినోత్సవాన్ని నిర్వహించారు.

● అదేవిధంగా ధర్మవరం ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కదిరిపట్టణంలోని వివలాంగుల భవనంలో జనసేన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిగుబ్బలోని అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు. అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ సచివాల యంలో సిబ్బంది పంచాయతీ కార్యదర్శి జానకి ఆధ్వర్యంలో, లోకోజుపల్లి ప్రాథమిక పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకు న్నారు. అలాగే నల్లచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తనకల్లు మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ కమిటీ సభ్యులు నివాళులు అర్పించారు.



ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్



కదిరిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పోరెడ్డివారిపల్లిలో రైతన్నా.. మీకోసం



రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ

గాండ్లపెంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూపల్లి పంచాయతీ పోరెడ్డివారిపల్లిలో బుధవారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అన్నదాత సుఖీభవ రెండో విడత రూ. 7వేలు వారి ఖాతాలో జమచేసిందన్నారు. జమ కాని రైతులు వ్యవసాయ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ రైతులు ఏపీఏఐఎంఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ కరపత్రాలను రైతులకు అందజేశారు. అనంతరం రాజ్యాంగ దినత్సోవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఎంపీడీఓ రామకృష్ణ, వ్యవసాయ అధికారి షాదాబ్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, నాయకులు సిద్దారెడ్డి, రైతులు గెంగిరెడ్డి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంకేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లిలో బుధవారం 'రైతన్నా... మీకోసం' కార్యక్రమాన్ని ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటా సర్వే చేపట్టారు. అనంతరం వ్యవసాయం, అనుబంధ శాఖల పథకాలను, ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రవీంద్ర, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



భీమబోయనపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● నంబులపూలకుంట: మండలపరిధిలోని పడమరనడింపల్లి పంచాయతీ భీమబోయనపల్లి, తాటిగుంత గ్రామాల్లో బుధవారం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ప్రతిఇంటికి వెళ్లి రైతులను కలిసి చర్చించారు. ఏఈఓ రాధ, వీఆర్‌ఓ దీపిక, రైతులు, నాయకులు మహబూబ్‌బాషా, విజయ్‌కుమార్‌యాదవ్, రాజశేఖర్‌యాదవ్, రత్నమయ్య, రామక్రిష్ణ, వెంకటస్వామి, శంకర్, చెన్నయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయ ద్వారం స్థల పరిశీలన

గాండ్లపెంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ కటారుపల్లి క్రాస్‌లోని ఖబ్బం నరసింహస్వామి ఆలయ ముఖద్వారం స్థలాన్ని ఆర్డీఓ వీవీఎస్ శర్మ బుధవారం పరిశీలించారు. కటారుపల్లి క్రాస్‌లోని వద్ద 477 సర్వే నంబర్‌లో కేజీబీవీని నిర్మించారు. ఆ ఆవరణలోనే నరసింహస్వామి ద్వారం, కటారుపల్లి క్రాస్‌లోని పలువురి శ్మశానవాటిక ఉన్నాయి. ఇటీవల కేజీబీవీ అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం స్థలాన్ని చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ప్రజావేదికలో ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. దీంతో ఆయన పరిశీలించారు. ఖబ్బం నరసింహస్వామి ముఖ ద్వారం స్థలాన్ని పరిరక్షిస్తామని, శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తామని ఆయన తెలిపారు. అలాగే ఆయన కేజీబీవీ నిర్మాణాన్ని పరిశీలించారు.

నీటి కొళాయిలకు మూతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమడగూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ మూడు రోడ్ల కూడలిలో హోటళ్లకు ఏర్పాటు చేసుకున్న తాగునీటి కొళాయిలను పంచాయతీ కార్యదర్శి జానకి ఆధ్వర్యంలో బుధవారం తొలగించి మూతలు వేశారు. కూడలిలో హోటళ్లకు రోడ్డు పక్కనే పైప్‌లైన్ తీసుకుని కొళాయిలు వేసుకున్నారు. భారీ వాహనాలు వెళ్లడంతో పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా అవుతోంది. అలాగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇ బ్బందిగా మారింది. దీనిపై 'వృథాగా తాగునీరు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్పందించారు. అక్రమంగా కొళాయిలు ఏర్పాటు చేసుకోవడం వల్ల తాగునీరు వృథా అవడంతోపాటు వాహనాల రాకపోకలకు ఇబ్బం దులు కలుగుతున్నాయన్నారు. దీంతో హోటళ్లకు వేసుకున్న కొళాయిలను తొలగించి మూతలు వేశారు. కొళాయిలు అవసరమైన వారు పంచాయతీ అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసుకోవాలని ఆమె తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

● కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేశ్

ధర్మవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ యత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ డిమాండ్‌చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబరు 590 తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే పేద, సామాన్య మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు పూర్తిగా దూరమవుతారని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాల పెంపుపై ప్రభుత్వం దృష్టి

● ఉద్యోగాలకు 81మంది ఎంపిక: హరీశ్‌బాబు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో బీజేపీ నాయకుడు హరీశ్‌బాబు

ధర్మవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 193 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలు నిర్వహించగా వారిలో 81 మంది వివిధ కంపెనీలకు ఎంపిక య్యారని హరీశ్‌బాబు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరిక్రిష్ణ, ఏపీ స్టేట్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, సీడాప్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యాలను చేరుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సోమందేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలకు సంబంధించి వందశాతం లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. అన్నిరికార్డులు పరిశీలించారు. ఓపీ, వ్యాక్సినేషన్ శీతలీకరణ విభాగాన్ని తనిఖీ చేశారు. కాన్పుల గదిని పరిశీలించి వైద్యాధికారి ఆయిషాతో గర్భవతులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలు వందశాతం పూర్తిచేసేలా లక్ష్యాలను నిర్ధేశించుకోవాలన్నారు. సిబ్బంది కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మధుబాబు, పర్యవేక్షకులు రవీంద్ర, సిబ్బంది విశ్వసుధ, ప్రభాకర్‌రాజు, మాలతిదేవి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

గోరంట్ల, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను బుధవారం జిల్లా గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రామ్, తహసీల్దార్ మారుతి, డిప్యూటీఈఓ జాన్‌రెడ్డెప్ప తనిఖీ చేశారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ తులసీబాయితో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజిన్ జరిగిందనడంలో వాస్తవం లేదన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. అనంతరం టీడీపీ నాయకులు కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల విద్యాధరణీ, నిమ్మల శ్రీధర్, రవినాయక్, ఉమాశంకర్ పాఠశాలలను సందర్శించి ఎటువంటి సమస్యలు తలెత్తినా తమకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయండి'

సోమందేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి జనసేన పార్టీ నాయకులు కృషిచేయాలని పెనుకొండ నియోజకవర్గ నాయకులు రంగేపల్లి నాగరాజు సూచించారు. బుధవారం విజయవాడలో రాష్ట్ర కార్యదర్శి రాంతాళ్లరిని కలిసి పార్టీ అభివృద్ధిపై చర్చించడం జరిగిందన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్దాంతాలను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. అదేవిధంగా పార్టీ సభ్యత్వ నమోదు, సోషల్ మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు, పవన్‌కల్యాణ్ సందేశాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. అదేవిధంగా పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపి గ్రామస్థాయిలో బలోపేతానికి కృషిచేస్తామన్నారు. కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రచేనేత వికాస విభాగం కార్యదర్శి యర్రిస్వామి చిప్పల, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

చిలమత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన కార్యకర్త నాగరాజు కుటుంబాన్ని బుధవారం మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణయాదవ్ వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. బాధిత కుటుంబానికి లక్ష్మీనారాయణయాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట నాయకులు భాస్కర్, సుకన్య వెంకటేష్, పాలేపల్లి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ఓ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని తనను మోసం చేసినట్లు బాధితుడు బాలాజీ తెలిపాడు. ఒకసారి రూ. 16,500, మరోసారి 25, 500 ఫోన్‌పే ద్వారా అకౌంట్‌లోకి వేయించుకుని తరువాత స్పందించలేదని, దీంతో తాను మోసపోయానని తెలుసుకుని సైబర్‌క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాను ఓ యాప్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరులోని ఓ కంపెనీలో తనకు ఉద్యోగం ఇప్పిస్తామని, దరఖాస్తును పరిశీలించడం జరిగిందని తెలిపారన్నారు. అకౌంట్ తెరిచేందుకు రూ. 16, 500 మొదటి విడతగా వేయాలని అడగ్గా తాను ఫోన్‌పే చేశానన్నారు. అనంతరం రూ. 25, 500 అకౌంట్‌లోకి వేస్తే ఉద్యోగం కన్‌ఫాం చేస్తామని చెప్పడంతో ఆ డబ్బులు ఫోన్‌పే ద్వారా వేయడం జరిగిందన్నారు. అనంతరం ఫోన్ చేయగా స్విచాఫ్ అని వస్తోందని, దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

ముద్దాయికి జైలు శిక్ష

గుడిబండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం యర్రబల్లి గ్రామానికి చెందిన దారా రమేష్‌కు మడకశిర న్యాయాధికారి జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. గుడిబండ మండలం మద్దనకుంట గ్రామానికి చెందిన వీర హనుమక్క ఇంటిలో బంగారు గొలుసు దొంగతనం కేసులో అప్పటి ఎస్‌ఐ శరత్‌చంద్ర ముద్దాయి దారా రమేష్‌పై 2018లో కేసు నమోదుచేశారు. కోర్టులో కేసురుజువు కావడంతో ముద్దాయికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

క్రమబద్ధీకరణకు గడువు ఇవ్వండి

యథేచ్ఛగా దందాపై కదిలిన రియల్టర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా వేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు వారం రోజులు గడువు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను రియల్టర్లు కోరారు. 'యథేచ్ఛగా దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన కథనంతో రియల్టర్లలో కదలిక వచ్చింది. జీఓఎంఎస్ నంబరు 134 ప్రకారం అన్ని అనుమతులు తీసుకుంటామన్నారు. అయితే ఇదే క్రమంలో రియల్టర్లకు హాజరు నోటీసు దుద్దేబండ కార్యదర్శి షామీర్ అందించారు. అనుమతులు తీసుకోకపోతే మరో వారం రోజులపాటు వ్యవసాయ పొలాల్లో వేసిన రాళ్ల తొలగిస్తామన్నారు.

చాకర్లపల్లి రైల్వే బ్రిడ్జి పూర్తయ్యేనా..?

డిసెంబరుకల్లా పూర్తికి రైల్వే సహాయమంత్రి హామీ

నేటికీ ప్రారంభంకాని పనులు

హామీ అమలుపై సందేహాలు



ఆగిన చాకర్లపల్లి రైల్వే బ్రిడ్జి పనులు

సోమందేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చాకర్లపల్లి రైల్వే బ్రిడ్జి అర్ధాంతరంగా ఆగిపోయింది. సమస్యను పరిష్కరిస్తామన్న రైల్వే సహాయ మంత్రి సోమణ్ణ ఇచ్చిన హామీ హామీగానే ఉండిపోయింది. దీంతో స్థానికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ యేడాది జనవరి 5న కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న పెనుకొండ రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభానికి వచ్చారు. చాకర్లపల్లి రైల్వే బ్రిడ్జి అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఎంపీ బీకే పార్థసారథి ఆయన్ను కలిసి బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమందేపల్లి మండల పరిధిలో చాకర్లపల్లి రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి రంగేపల్లి రైల్వేస్టేషన్ సమస్యలపై అర్జీలు సమర్పించారు. స్పందించిన రైల్వే సహాయమంత్రి 2025 డిసెంబరు ఆఖరుకల్లా సమస్యలను పరిష్కరించి టికెట్ కౌంటర్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రైలు స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వేస్టేషన్ హామీని నెరవేర్చారు. అయితే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం సంబంధించి ఇంతవరకు అడుగుపడలేదు. ఇంకెప్పుడు నిధులను విడుదలచేసి నిర్మాణాన్ని పూర్తీచేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 2018-19లో టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న బీకే పార్థసారథి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషిచేశారు. నిధులను రాబట్టారు. కేంద్ర ప్రభుత్వం 50శాతం రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులతో చాకర్లపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం అయింది. నిర్మాణ పనులు సైతం టెండరు దక్కించుకున్న గుత్తేదారు పనులను ప్రారంభించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రం వాటా నిధులు విడుదల కాలేదు. దీంతో కేంద్రం విడుదల చేసిన నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఐదేళ్లపాటు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తీగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ దిశలో ప్రస్తుతం ఎంపీగా ఉన్న బీకే పార్థసారథి పెనుకొండ వెళ్తున్న మంత్రి సోమణ్ణను చాకర్లపల్లి వద్ద కలిసి ప్రజలతోపాటు సమస్యలను ఆయనకు వివరించారు. అదేవిధంగా పెనుకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సవిత స్థానిక రైల్వే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి సోమణ్ణ చాకర్లపల్లి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తీగా కేంద్రం నిధులతోనే చేపడతామని, ఏడాదిలోపు పూర్తీచేస్తామని హామీ ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే చాకర్లపల్లి రైల్వేగేటువద్ద గంటలతరబడి వేచి ఉండే బాధ తప్పుతుందని స్థానికులు అంటున్నారు. చాకర్లపల్లి రైల్వే స్టేషన్, బ్రిడ్జి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే చేనేత పరిశ్రమకు పేరుగాంచిన సోమందేపల్లి ప్రజలు తాము తయారుచేసిన చీరలను వేరే ప్రాంతాలకు తరలించి మార్కెటింగ్ చేసుకోవడానికి వీలు కలుగుతుందని కలలుగన్నారు. వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు కృషిచేసి కేంద్ర మంత్రి నిధులను రాబట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

పెనుకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పరవక్కరివద్ద వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో మొదటి షష్ఠి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు శేషప్పస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, నవగ్రహ సుబ్రమణ్యస్వామి, మూలమంత్ర సహిత రుద్రస్వాహాకార హోమాలు, రతాంగ హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ప్రసాద వినియోగం, బ్రాహ్మణ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

చిలమత్తూరు: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా చెనేపల్లి గ్రామంలో వెలసిన స్వామివారి ఆలయంలో బుధవారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌ని మంగళవాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేశారు. మహిళలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలుద్దాం

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అన్నపూర్ణ

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవితో జీవిస్తున్న వారికి అండగా నిలుద్దామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌ఐవితో జీవిస్తున్నవారు, వారి పిల్లలతో అవసరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవితో జీవిస్తున్న పిల్లలు వారి చదువులపై దృష్టిసారించాలని సూచించారు. హెచ్‌ఐవి అనే వ్యాధికి ఇప్పుడు చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే ఇబ్బందులు ఉన్నట్లయితే ఏఆర్‌టీ కేంద్రంలో సంప్రదించాలన్నారు. డయాబెటిస్ హైపర్‌టెన్షన్‌లాగే ఇదికూడా ఓ వ్యాధి అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఇలాంటివారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసి ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, సీడీపీఓ వరలక్ష్మీ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ రమణ, మురళి పాల్గొన్నారు.

ఆటస్థలం ఏర్పాటుకు చర్యలు

గోరంట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు సంబంధించి ఆటస్థలం ఏర్పాటుకు బుధవారం అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ మారుతి, సర్వేయర్ తాతయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు రేఖ, జూనియర్ అసిస్టెంట్ కళావతి గోరంట్లలోని రావికుంట స్థలాన్ని పరిశీలించారు. కుంట స్థలంలో పంచాయతీ వారు చదును చేసి డపింగ్‌యార్డు, పార్కు ఏర్పాటు చేశారు. పార్కు పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని రెవెన్యూ అధికారులు ఆటస్థలంకోసం సూచించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య

అమరాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పూజ(26) జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఇషాక్‌బాష తెలిపారు. వివాహమై ఆరేళ్లయినా పిల్లలు కలుగకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్టగురికి మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి మృతి

రొళ్ల/అమరాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గుట్టగురికి మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. గౌడనకుంట టీడీపీ నాయకుడు సిద్దరామప్ప అనారోగ్యంతో మృతిచెందగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, శివరుద్రప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్, నన్నలింగప్ప, దాదాపీర్, జయరామప్ప, చెన్నప్ప, తిప్పేస్వామి ఈయన వెంట ఉన్నారు.

'స్వచ్ఛంద సంస్థపై చర్యలు తీసుకోండి'

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వచ్ఛంద సంస్థపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఐవి, క్షయ నియంత్రణ అధికారులు ఫిర్యాదు చేశారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ప్రజాసంఘాల నాయకులు ఉదయ్‌కుమార్, శ్రీరాములు, ఉమర్ ఫారూక్, కొల్లకుంట నాగరాజు తదితరులు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఐవీ నియంత్రణకోసం స్వచ్ఛంద సంస్థకు నిధులు వస్తున్నాయని వాటిని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణచేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలకు మూలం.. రాజ్యాంగం

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయాధికారులు

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్ని చట్టాలకు మూలం భారత రాజ్యాంగమేనని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణంలో ఏడీజేతోపాటు న్యాయాధికారులు వెంకటేశ్వర్లునాయక్, లలిత లక్ష్మీ, హరికకోట, రమణయ్య రాజ్యాంగ పీఠిక ఆధారంగా రూపొందించిన ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా బార్ అసోసియేషన్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్

● **పెనుకొండ:** స్థానిక సత్యసాయి కళాశాలలో ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో మండల న్యాయసేవ అధికార సంస్థ బుధవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సివిల్ న్యాయాధికారి వాసుదేవన్, న్యాయవాదులు మధుసూదన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రిటైర్డ్ టీచర్ రంగారెడ్డి హాజరై ప్రసంగించారు. రాజ్యాంగ పరిరక్షణ, ఉపయోగాలు తదితర విషయాలను అతిథులు విద్యార్థులకు వివరించారు.

సబ్సిడీ దాణా మంజూరు

రొద్దం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీ ధరతో వందప్యాకెట్ల దాణాను మంజూరుచేసిందని పశువైద్యాధికారి జాహ్నవి బుధవారం తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో 5-8ప్యాకెట్లు చొప్పున రైతులకు కేటాయించామన్నారు. ప్రభుత్వ ధర రూ.1100కాగా 50శాతం సబ్సిడీతో రూ.550చొప్పున చెల్లించి రైతులు తీసుకెళ్లవచ్చన్నారు.

అలూడిలో 'రైతన్నా.. మీకోసం'

అగళి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని మండల పరిధిలోని అలూడి గ్రామంలో బుధవారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొని ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ తదితర పథకాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ నరసింహప్ప, రాజు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు భానుప్రకాశ్, వీఆర్‌ఓ నరసింహమూర్తి, వీఆర్‌ఏ మంజునాథ్ పాల్గొన్నారు.

తమడేపల్లిలో...

అమరాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయం రైతుసేవాకేంద్రం పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఓ మంజునాథ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ సుఖీభవ, పీఎంకిసాన్ తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతుసేవాకేంద్రం అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తరహళ్లి హుండీ ఆదాయం రూ.6.27 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

మడకశిర రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలలోని భక్తరహళ్లి నరసింహస్వామి,జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించిన హుండీలను బుధవారం లెక్కించారు. రూ.6.27 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ నరసంహరాజు తెలిపారు. ఐదు నెలలకు సంబంధించి నరసంహస్వామి ఆలయ హుండీ నుంచి రూ4.14 లక్షలు, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయహుండీ నుంచి రూ2.13 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సేగౌడ్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

పార్టీ నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకురాలు పర్వీన్‌బాను



మాట్లాడుతున్న పర్వీన్‌బాను

రొద్దం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పెనుకొండ నియోజకవర్గ పార్టీ ప్రత్యేక పరిశీలకులు పర్వీన్‌బాను పేర్కొన్నారు. బుధవారం రొద్దంలోని టీడీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ద్వేషభావాలు పెంచుకోకుండా, ఐకమత్యంతో నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి ఓ వైపు సంక్షేమం మరోవైపు నడిపిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి అప్పుల రాష్ట్రాన్ని మన చేతిలో పెట్టిందని విమర్శించారు. ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను నెరవేరుస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డివారి మంజునాథ్, కన్వీనర్ నరహరి, బైలర్ ఆంజనేయులు, అశ్వర్థనారాయణ, క్లస్టర్ ఇన్చార్జులు సిద్దన్న, గంగాధర్, రాజేష్ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

రాజీమార్గంలోనే కేసుల పరిష్కారం

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇరు కక్షిదారులు రాజీమార్గంలో కేసులు పరిష్కరించడమే లక్ష్యమని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. బుధవారం కోర్టు ఆవరణంలో మెగా లోక్ అదాలత్‌పై అధికారులతో న్యాయవాదులు, పోలీసులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడం కోసం అందరూ సహకరించాలన్నారు. పోలీసులు తమ తమ పోలీస్‌స్టేషన్‌పరిధిలో రాజీ అయ్యే కేసులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముందస్తుగానే కేసులు గురించి న్యాయాధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారదిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డిసెంబరు 13న జాతీయ మెగాలోక్ అదాలత్ జరుగుతుందని సాధ్యమైనంతమేర ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఏపీపీ నగేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్ కరీం, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముగిసిన సపోజ్ క్రిస్మస్ వేడుకలు



సపోజ్ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న పాస్టర్లు

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చర్చిల్లో బుధవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలు ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఫ్యామిలీ సండే, యూత్ క్రిస్టియన్ ఫెలోషిప్ వార్షికోత్సవం, సపోజ్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మానవాళిని పాపం నుంచి రక్షించేందుకు యేసుక్రీస్తు జన్మించాడన్నారు. ఆయన ప్రేమమయుడని, దయామయుడని అన్నారు. పట్టణంలోని సీఅండ్‌ఐజి మిషన్‌చర్చి, మిషన్ కాంపౌండ్ చర్చిలో ఈ వేడుకలు జరిపారు. ఆర్‌ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సపోజ్ క్రిస్మస్, క్యాండిల్ లైట్ జరిగింది.

కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్స్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్‌హబ్ సెంటర్‌లో కస్టమర్‌కేర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కోర్సు, కంప్యూటర్, సాఫ్ట్‌స్కిల్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాస్, ఫెయిల్ అయిన వారికి నాలుగు నెలలపాటు ఈ కోర్సు ఉంటుందన్నారు.

ప్రభుత్వ ఇంటి కోసం..

పెనుకొండ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పట్టా, సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులు ఈనెల 30లోపు గృహనిర్మాణానికి దరఖాస్తుచేసుకోవాలని కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. బుధవారం 4, 8వార్డుల్లో పర్యటించి అవగాహన కల్పించారు. ఇటీవల దరఖాస్తు చేసుకున్నవారికి గృహనిర్మాణ నియామక పత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రూ.2.50లక్షలు గృహనిర్మాణానికి ప్రభుత్వం అందిస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, రఘువీరచౌదరి, కురుబ నంజుండ, సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి: ఎంపీడీఓ

సోమందేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరిసేలా కార్యదర్శులు, వీఓలు కృషిచేయాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మీ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో ప్రసంగించారు. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ పథకం కింద పంచాయతీల అభివృద్ధి, వార్షిక కార్యాచరణ, ప్రణాళికల తయారీపై కార్యదర్శులు, గ్రామైక్యసంఘాలు వీఓలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి పచ్చదనం వెల్లివిరిసేలా చూడాలన్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రేమ్‌కుమార్, శిక్షకులు యోగేశ్వర్, ఏపీఎం, మదన్‌మోహన్, ఏఓనర్సింగరావు, కార్యదర్శులు వీఓలీడర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం బీజేపీ సీనియర్ నాయకులు బంగారుచంద్ర అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియమ నిష్టలతో 41 రోజులపాటు దీక్ష చేసే మాలధారులకు భిక్ష ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు మాలదారులకు భిక్ష ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళాలు

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేపట్టిన అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పంచాయతీ కార్మికుడు హనుమంతు రూ.30 వేలను విరాళంగా బుధవారం అందజేశారు. డాక్యుమెంట్ రైటర్ మహేశ్వరప్ప దంపతులు రూ.25 వేలు అందజేశారు.



విరాళం అందిస్తున్న మహేశ్వరప్ప దంపతులు